నమస్తే తెలంగాణ
రంగారెడ్డి
I | హైదరాబాద్, బుధవారం 11 సెప్టెంబర్ 2024 | RANGAREDDY

ఐలమ్మ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న రంగారెడ్డి కలెక్టర్ శశాంక

సాయుధ రైతాంగ పోరాటానికి
ఐలమ్మ స్ఫూర్తి

రంగారెడ్డి కలెక్టర్ శశాంక

కలెక్టరేట్‌లో చాకలి ఐలమ్మ 39వ వర్ధంతి

రంగారెడ్డి, సెప్టెంబర్ 10 (నమస్తే తెలంగాణ) : భూమి కోసం.. భుక్తి కోసం.. వెట్టి చాకిరీ విముక్తి కోసం జరిగిన తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటానికి స్ఫూర్తినిచ్చిన వీరవనిత చాకలి ఐలమ్మ అని రంగారెడ్డి కలెక్టర్ శశాంక అన్నారు. మంగళవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ భవనంలోని వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ కార్యాలయంలో బీసీ వెల్ఫేర్ ఆధ్వర్యంలో చాకలి ఐలమ్మ 39వ వర్ధంతిని నిర్వహించారు. కలెక్టర్ శశాంక ముఖ్యఅతిథిగా పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి చాకలి ఐలమ్మ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తెలంగాణ రైతాంగ పోరాటంలో వీరవనితగా గుర్తింపు పొందిన ఐలమ్మ జయంతి ఉత్సవాలను అధికారికంగా నిర్వహించాలని తెలంగాణ ప్రభుత్వం నిర్ణయించి 2022 సెప్టెంబర్ 22న ఉత్తర్వులు జారీ చేసిందని తెలిపారు. మాటల్ని తూటాలుగా మల్చుకొని పేదల పక్షాన నిలిచి పోరాడిన వీరవనిత చాకలి ఐలమ్మ అని కొనియాడారు. 1940-44 మధ్య కాలంలో విస్నూర్‌లో దేశ్ ముఖ్, రజాకర్ల అరాచకాలపై వీరోచిత పోరాటం చేసి ప్రజా పోరాటాలకు స్ఫూర్తిగా నిలిచిందన్నారు. కార్యక్రమంలో బీసీ వెల్ఫేర్ అధికారి కేశవ్ రామ్, రజక సంఘం ప్రెసిడెంట్ ఎ.ఆంజనేయులు, జిల్లా రజక సంఘం ప్రెసిడెంట్ ఎం. అజయ్, బీసీ ఫ్రంట్ చైర్మన్ మల్లేశ్ యాదవ్, ఆదిబట్ల మున్సిపల్ చైర్మన్ నిరంజన్ రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

నేటినుంచి మున్సిపాలిటీలోకి..

నాలుగు గ్రామాల విలీనం పూర్తి

పెద్దఅంబర్‌పేట, సెప్టెంబర్ 10 : ఓఆర్‌ఆర్ లోపల, సమీపంలోని నాలుగు గ్రామాలు పెద్దఅంబర్‌పేట మున్సిపాలిటీలో విలీనమయ్యాయి. అబ్దుల్లాపూర్‌మెట్ మండలంలోని బాచారం, తారామతిపేట, గౌరెల్లి, కుత్బుల్లాపూర్ గ్రామ పంచాయతీలను ఇటీవలే సమీపంలోని పెద్దఅంబర్‌పేట మున్సిపాలిటీలో కలుపుతూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. ఈ మేరకు ఆ నాలుగు గ్రామపంచాయతీలు బుధవారం నుంచి పెద్దఅంబర్‌పేట మున్సిపాలిటీలో విలీనం అయినట్టే. ఈ మేరకు మున్సిపల్ జాయింట్ డైరెక్టర్, నాలుగు గ్రామాల విలీన పర్యవేక్షణ అధికారి శ్రీపాద రామేశ్వర్‌రావు పెద్దఅంబర్‌పేటలోని మున్సిపల్ కార్యాలయంలో ఆయా గ్రామాల పంచాయతీ సెక్రటరీలతో సమావేశమయ్యారు. ఎలా విలీనం అవుతాయి, ఎలాంటి మార్పులు చోటుచేసుకుంటాయనే అంశాలపై పలు సూచనలు చేశారు. ఏదీ ఏమైనా ఇప్పటివరకు పెద్దఅంబర్‌పేట, పసుమాముల, కుంట్లూరు, తట్టిఅన్నారం గ్రామ పంచాయతీలతో ఏర్పడిన పెద్దఅంబర్‌పేట మున్సిపాలిటీ విస్తీర్ణం మరింత పెరగనున్నది. ఈ మేరకు పాలనంతా మున్సిపాలిటీ నుంచి సాగనున్నది. మరోవైపు, ఆయా గ్రామ పంచాయతీల రికార్డులను స్వాధీనం చేసుకోవాలని మున్సిపల్ అధికారులకు సీడీఎంఏ నుంచి ఆదేశాలు వచ్చినట్టు తెలుస్తున్నది. కానీ, రికార్డుల అప్పగింతపై ఆయా గ్రామ పంచాయతీలకు పంచాయతీరాజ్ నుంచి ఎలాంటి ఆదేశాలు రాకపోవడంతో అస్పష్టత నెలకొన్నట్లు సమాచారం.

తిరస్కరణే అధికం..

జిల్లాలో ధరణి దరఖాస్తులు ఎక్కువగా తిరస్కరణకు గురవుతున్నాయి. మొత్తం అప్లికేషన్లలో 90 శాతం వరకు రిజెక్టు కాగా, మిగిలినవి అధికారుల ఆమోదం పొందా యి. నెల రోజుల్లో దాదాపు 8 వేల దరఖాస్తులను అధికారులు పరిష్కరించారు. దరఖాస్తులు అధికంగా రిజెక్టు అవుతుండడంతో భూబాధితులు మళ్లీ దరఖాస్తు చేసుకుంటుండడంతో అవి పెండింగ్‌లో పడిపోతున్నాయి. ఈ అప్లికేషన్ల పరిష్కారా నికి తహసీల్దార్ల రిపోర్టులు కీలకం కావడంతో వారు రైతుల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నారనే ఆరోపణలున్నాయి.

ధరణి దరఖాస్తుల పరిష్కారంలో 90 శాతం వరకు రిజెక్టే

గత నెల రోజుల్లో 8 వేల దరఖాస్తులకే మోక్షం

తిరస్కరించిన వెంటనే మళ్లీ దరఖాస్తు చేసుకుంటున్న బాధితులు

రిపోర్టులు ఇవ్వడంలో తహసీల్దార్ల చేతివాటం!

క్షేత్రస్థాయి సర్వేతోనే ఆర్‌ఎస్‌ఆర్ సమస్యకు పరిష్కారమంటున్న అధికారులు

వికారాబాద్, సెప్టెంబర్ 10 (నమస్తే తెలంగాణ) : జిల్లాలో ధరణి దరఖాస్తుల పరిష్కారంలో తిరస్కరణకు గురైనవే అధికంగా ఉంటున్నాయి. మొత్తం అప్లికేషన్లలో 90 శాతం వరకు రిజెక్టు కాగా మిగిలినవి అధికారుల ఆమోదం పొందాయి. గత నెల రోజుల్లో దాదాపు 8 వేల దరఖాస్తులను తహసీల్దార్ మొదలుకొని ఆర్డీవో, అదనపు కలెక్టర్, కలెక్టర్ స్థాయిల్లో పరిష్కరించారు. జిల్లా రెవెన్యూ యంత్రాంగం లక్ష్యానికి అనుగుణంగా దరఖాస్తులను పరిష్కరించామని చెబుతున్నా.. అధికంగా తిర స్కరించినవే ఉండడంతో భూ సమస్యలు పరిష్కారం కాని రైతులు మళ్లీ దరఖాస్తు చేసుకుంటున్నారు. ప్రభుత్వం స్పెషల్ డ్రైవ్ నిర్వహించి పెండింగ్‌లో ఉన్న అన్ని దరఖాస్తులను పరిష్కరించాలని ఆదేశించడంతో గత నెల రోజుల్లో పది శాతం వరకు పరిష్కారానికి నోచుకోగా 90 శాతం అప్లికేషన్లు రిజెక్టు అయ్యాయి.

అధికంగా తిరస్కరణకు గురవుతుండడంతో భూబాధితులు మళ్లీ దరఖాస్తు చేసు కుంటుండడంతో రోజురోజుకూ అప్లికేషన్లు పేరుకుపోతున్నాయి. అయితే భూబాధి తులతో సంబంధం లేకుండా రిపోర్టులు పంపించాలని పై అధికారుల నుంచి ఆదేశా లు రావడంతో తహసీల్దార్లు అన్ని సరిగ్గా ఉన్నా ఏదో ఒక కొర్రీ పెడుతూ రిజెక్టు అయ్యేలా పంపుతున్నట్లు ఆరోపణలున్నాయి. అంతేకాకుండా ధరణి ఆపరేటర్లతో రిపోర్టులను రెడీ చేయిస్తూ. సంబంధిత రైతులు డబ్బులు ఇవ్వకుంటే తప్పుడు రిపోర్టులు పంపుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

8 వేల దరఖాస్తులకు పరిష్కారం..

జిల్లాలో గత నెల రోజుల్లో 8 వేల దరఖాస్తులను పరిష్కరించామని అధికారులు చెబుతున్నా.. పెండింగ్‌లో పడుతున్న దరఖాస్తుల సంఖ్య రోజురోజుకూ పెరిగిపోతున్నది. అయితే దరఖాస్తులను ఎక్కువ రోజులు పెండింగ్‌లో ఉంచొద్దని, త్వరగా పరిష్కరించాలని నిర్ణయించిన కలెక్టర్ ప్రతీక్ జైన్...అందుకు అనుగుణంగా తహసీల్దార్ల నుంచి రిపోర్టుల ను తెప్పించుకొని పరిష్కరిస్తున్నారు. అయితే కొందరు తహసీల్దార్లు రిపోర్టులు పంపించడంలో అవినీతికి పాల్పడుతున్నట్లు ప్రచారం జరుగుతున్నది. ధరణి దరఖాస్తుల పరిష్కారానికి తహసీల్దార్ రిపోర్టు తప్పనిసరి కావడంతో ఇదే అదునుగా చేసుకొని కొందరు తహసీల్దార్లు కిందిస్థాయి సిబ్బందితో కుమ్మక్కై జోరుగా వసూలు చేస్తున్నట్లు ఆరోపణలున్నాయి. జీఎల్ఎం మాడ్యుల్ (గ్రీవెన్స్ ల్యాండ్ మ్యాటర్స్) దరఖాస్తులు తహసీల్దార్ల స్థాయిలోనే పరిష్కారం అవుతుండడంతో బాధితుల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నట్లు ప్రచారం జరుగుతున్నది. తహసీల్దార్ల కనుసన్నల్లో నడుస్తున్న రిపోర్టుల దందాపై కలెక్టర్ దృష్టి సారించాలని రైతులు కోరుతున్నారు.

ఆర్‌ఎస్‌ఆర్ సమస్యే ప్రధానం..

జిల్లాలో ప్రధానంగా టీఎం-33 అనంతరం ఆర్‌ఎస్ ఆర్ సమస్యతోనే రైతులు ఎక్కువగా ఇబ్బంది పడుతున్నారు. రైతులకు ఉన్న భూమి కంటే ఎక్కువ లేదా తక్కువ భూమి ఉన్నట్లు ధరణి ఆపరేటర్లు తప్పుగా ఎంట్రీ చేయడంతో ఆర్‌ఎస్‌ఆర్ సమస్య ఉత్పన్నమై.. దాని పరిష్కారానికి రైతులు తహసీల్దార్ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. పాత రికార్డుల ప్రకారం సంబంధిత సర్వేనంబర్‌లో ఏ రైతుకు ఎంత భూమి ఉందనే వివరాలను తెలుసుకొని ఆర్‌ఎస్‌ఆర్ సమస్యను

పరిష్కరించొచ్చు.. కానీ, రికార్డుల్లోనూ తప్పుగా ఎంట్రీ కావడంతో సమస్య పరిష్కారానికి నోచుకోవడం లేదు. అంతేకాకుండా ఓ రైతు పేరిట ఎక్కువ భూమి నమోదైనట్లు ధరణిలో గుర్తించడం పెద్ద కష్టంగా మారడం .. సంబంధిత రైతూ సహకరించకపోవడంతో ఈ సమస్య పరిష్కారం కావడంలేదు. అయితే ఆర్‌ఎస్‌ఆర్ సమ స్య పరిష్కారానికి ధరణి పోర్టల్‌లో ఆప్షన్ ఇచ్చినా...కేవలం 10 శాతం మాత్రమే వీలుందని, శాశ్వత పరిష్కారానికి క్షేత్రస్థాయిలో భూసర్వే చేయాలని రెవెన్యూ అధి కారులు పేర్కొంటున్నారు. కాగా కలెక్టర్ ఆర్‌ఎస్‌ఆర్ సమస్య పరిష్కారమైన తర్వాతే రిపోర్టులను తనకు పంపించాలని తహసీల్దార్లను ఆదేశించినట్లు సమాచారం.

విద్యార్థి నాయకులతో మాట్లాడుతున్న ఎస్ఐ సత్యనారాయణ

గురుకులాన్ని తరలించొద్దు..

కడా కార్యాలయం ఎదుట విద్యార్థుల నిరసన

కొడంగల్, సెప్టెంబర్ 10 : దౌల్తాబాద్ మండలంలోని నీటూర్ గ్రామానికి మంజూరైన గురుకుల పాఠశాలను ఇతర ప్రాంతాలకు తరలించొద్దని విద్యార్థి నాయకులు కోరారు. మంగళవారం స్థానిక 'కడా' కార్యాలయం ఎదుట విద్యార్థి సంఘాల నాయకులతో పాటు విద్యార్థులు కలిసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నీటూర్ గ్రామంలో పాఠశాల ఏర్పాటు కావడం వల్ల చుట్టుపక్కల గ్రామాల విద్యార్థులకు ఎంతో సౌకర్యవంతంగా ఉంటుందని, దీంతో పాటు గ్రామం కూడా అభివృద్ధి చెందుతుందని అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. కొడంగల్‌లో చదువుకునే విద్యార్థులకు ఆర్టీసీ బస్సు అందుబాటులో లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామానికి ఒకే బస్సు సర్వీస్ ఉండడంతో ప్రయాణికులు, విద్యార్థులు కిక్కిరిసి వెళ్లాల్సి వస్తున్నదని వాపోయారు. విద్యార్థుల ఇబ్బందులను గుర్తించి సరైన సమయానికి అదనంగా బస్సు సర్వీస్‌ను నడుపాలని విద్యార్థులు కోరారు. ఎస్ఐ సత్యనారాయణ విద్యార్థి సంఘ నాయకులతో మాట్లాడి సమస్యను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇవ్వడంతో విద్యార్థులు నిరసనను విరమించారు.

38 టన్నుల రేషన్ బియ్యం పట్టివేత

మోకిల పోలీస్ స్టేషన్‌లో సీజ్ చేసిన లారీ

చేవెళ్ల రూరల్, సెప్టెంబర్ 10 : శంకర్‌పల్లి మండలం మోకిల పోలీస్ స్టేషన్ పరిధిలో భారీ ఎత్తున రేషన్ బియ్యం, గోధుమలు పట్టుబడ్డాయి. సివిల్ సప్లయ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డిప్యూటీ తహసీల్దార్ మాచన రఘునందన్ తెలిపిన కథనం ప్రకారం.. శంకర్‌పల్లి మండలం మిర్జాగూడ గ్రామ పంచాయతీ పరిధి ఇంద్రారెడ్డి నగర్‌లో రేషన్ బియ్యం అక్రమంగా డంప్ చేశారన్న విశ్వనీయ సమాచారంతో మంగళవారం తెల్లవారు జామున సివిల్ సప్లయ్ ఎన్‌ఫోర్స్‌మెంట్, జిల్లా విజిలెన్స్ అధికారులు దాడులు చేశారు. ఓ బర్రెల షెడ్డులో నిల్వ ఉంచిన రేషన్ బియ్యం, గోధుమల డంపును గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. అప్పటికే లోడ్ చేసిన ఓ లారీని సీజ్ చేసి మోకిల పోలీస్ స్టేషన్‌కు తరలించారు. షెడ్డులో ఉన్న బియ్యం, గోధుమలను లారీలో నింపి చేవెళ్లలోని సివిల్ సప్లయ్ గోదాంకు తరలించారు. ఈ సందర్భంగా డీటీ రఘునందన్ మాట్లాడుతూ నగర శివార్ల నుంచి రేషన్ బియ్యాన్ని తక్కువ ధరకు సేకరించి.. పొరుగు జిల్లాలు, రాష్ట్రాలకు తరలిస్తున్న ముఠా గుట్టును రట్టు చేశామన్నారు. మొత్తం 38 టన్నుల 300 కిలోల పీడీఎస్ రైస్, 11టన్నుల 250 కిలోల గోధుమలను స్వాధీనం చేసుకొని కేసు ఫైల్ చేశామని తెలిపారు. సీజ్ చేసిన లారీ డ్రైవర్లను విచారించగా.. మహ్మద్ ఇబ్రహీం అనే వ్యక్తి పేరు చెబుతున్నారని, విచారణలో పూర్తి విషయాలు తెలుస్తాయన్నారు. నగర శివార్లలో నిర్మానుష్య ప్రాంతాలను అక్రమార్కులు ఎంచుకుని పెద్ద ఎత్తున రేషన్ బియ్యం అక్రమంగా నిల్వ చేస్తున్నట్లు సమాచారం ఉన్నదని, దీనిపై దాడులు నిర్వహిస్తామన్నారు. రేషన్ బియ్యం అక్రమ రవాణా చేసే వారిపై పీడీ యాక్ట్ కింద కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఈ దాడుల్లో పౌర సరఫరాల శాఖ డీటీ రవీందర్ నాయక్, రాష్ట్ర విజిలెన్స్ టీం సభ్యులు పాల్గొన్నారు.

ఉన్నట్లా..? లేనట్లా..?

వానొచ్చింది.. వరదొచ్చింది.. చెరువుల్లోకి నీరొచ్చింది. కానీ..ఉచిత చేప పిల్లల జాడే లేదు. మళ్లీ మళ్లీ టెండర్లు పిలిచి ప్రభుత్వం కాలయాపన చేస్తుండడంతో ఈ ఏడాది ఉచిత చేప పిల్లల పంపిణీ ఉన్నట్లా..? లేనట్లా..? అన్న అనుమానాలను మత్స్యకారులు వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికిప్పుడు టెండర్ల ప్రక్రియను పూర్తి చేసినా.. చేప లను చెరువుల్లో వదిలేసరికి రెండు నుంచి మూడు నెలల సమయం పడుతుంది. అప్పట్లోగా వానకాలం ముగుస్తుంది. ఇక చేపలు ఎదిగేందుకు అవసరమైన నీళ్లూ ఉండకపోవచ్చు. టెండర్లతో ప్రభుత్వం కాలయాపన చేస్తుండడంతో చేపల వేటనే నమ్ముకుని జీవిస్తున్న 9,136 మత్స్యకార కుటుంబాలు జీవనోపాధి విషయంలో ఆందోళ న చెందుతున్నాయి.

- రంగారెడ్డి, సెప్టెంబర్ 10 (నమస్తే తెలంగాణ)

మిషన్ కాకతీయ పథకంతో చెరువులను అభివృద్ధి చేసిన కేసీఆర్ ప్రభుత్వం మత్స్య కారుల జీవితాల్లో వెలుగులు నింపేందుకు అనేక కార్యక్రమాలను చేపట్టింది. అం దులో భాగంగానే ఏడాది పొడవునా వారికి జీవనోపాధి కల్పించి ఆర్థిక భరోసా కల్పించేందుకు ఉచితంగా చేప పిల్లలను పంపిణీ చేసింది. 2016-17లో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించగా ..గడిచిన ఏడేండ్లలో 6.63 కోట్ల చేప పిల్లలను ఉచితంగా అందజేసింది. ఇందుకోసం రూ.4.40 కోట్ల వరకు ఖర్చు చేయగా.. 41,753 మెట్రి క్ టన్నుల చేపల ఉత్పత్తితో రూ.56.59 కోట్ల ఆదాయం సమకూరింది. జలాశయాల్లో ఉచితంగా వదిలిన బొచ్చ, రాహు, బంగారు తీగ, రొయ్య, ముల్లంగి తదితర చేపలతో మత్స్యకారులు ఏడాది పొడవునా ఉపాధిని పొందారు. చేపలు ఇతర రాష్ట్రాలకు ఎగుమతి అయ్యాయి. చేప పిల్లలను వేటాడేందుకు వలలు, రవాణా కోసం ద్విచక్ర వాహనాలు, లగేజీ ఆటోలు, బొలెరో వాహనాలను అందజేసింది. అలాగే మహిళా సహకార సంఘాలకు విరివిగా రుణాలను మంజూరు చేయడంతో పాటు ఫిష్ ఫుడ్ ఫెస్టివల్ కార్యక్రమాలను నిర్వహించి ఉపాధి అవకాశాలు మరింత మెరుగుపడేలా చర్యలు తీసుకున్నది. గత ప్రభుత్వం కల్పించిన భరోసాతో మత్స్యకారుల జీవితాల్లో పెనుమార్పులొచ్చాయి. ఎన్నో కుటుంబాలు ఆర్థికంగా నిలదొక్కుకున్నాయి.

ఆనాటి పండుగ సందడేదీ..

జిల్లావ్యాప్తంగా 120 మైనర్ ఇరిగేషన్ చెరువులు, 978 చెరువులున్నాయి. వీటి పరిధుల్లో 186 మత్స్య పారిశ్రామిక సహకార సంఘాలుండగా..అందులో 9,136 మంది సభ్యులుగా కొనసాగుతున్నారు. గత ప్రభుత్వంలో చేప పిల్లల పంపిణీ కార్యక్రమాన్ని పండుగ వాతావరణంలో నిర్వహించేవారు. కానీ..ఈసారి ఆ సందడి ఎక్కడా లేకుండా పోయింది. చేప పిల్లల పంపిణీకి సంబంధించి ఇప్పటివరకు టెం డర్ల ప్రక్రియ పూర్తికాకపోవడంతో ఇన్ టైంలో చేప పిల్లలను పంపిణీ చేస్తారా? లేదా..? అన్న దానిపై అధికార వర్గాల నుంచీ స్పష్టత లేదు. గతంలో ప్రతి ఏటా చేప పిల్లల పంపిణీని జూలైలోనే పూర్తి చేసేవారు. ఏవైనా అవాంతరాలు ఏర్పడితే ఆగస్టు మొదటి వారంలో ఈ తంతు పూర్తి అయ్యేది. ఇందుకోసం ప్రభుత్వం ఏప్రిల్ నుంచే సన్నాహాలు మొదలు పెట్టేది. ప్రాజెక్టులు, రిజర్వాయర్లలో పెంచేందుకు 80 ఎంఎం నుంచి 100 ఎంఎం సైజు చేప పిల్లలను.. చెరువులు, కుంటల్లో పెంచేందు కు 35ఎంఎం నుంచి 400ఎంఎం సైజులో ఉండే చేప పిల్లలను ప్రభుత్వం పంపిణీ చేసేది. అయితే ఈసారి ఇంకా టెండర్ల ప్రక్రియ పూర్తికాకపోవడంతో చేప పిల్లల పంపిణీపై నీలినీడలు కమ్ముకున్నాయి.

గతేడాది బిల్లులు చెల్లించక పోవడంతోనే ..!

ఈ ఏడాది జిల్లాలోని 813 చెరువుల్లో కోటీ93 లక్షల చేప పిల్లలను వదలాలని జిల్లా మత్స్యశాఖ ప్రభుత్వానికి నివేదిక పంపింది. ఈ మేరకు అధికారులు గత జూలై 10న టెండర్లు పిలిచినా ఒక్కరూ బిడ్ దాఖలు చేయలేదు. చివరి తేదీని 23 కు పొడిగించినా ఫలితంలేదు. దీంతో గడువును ఆగస్టు 13కు పెంచి ముచ్చటగా మూడోసారి టెండర్లు పిలిచినా గుత్తేదార్ల నుంచి స్పందన రాలేదు. నాలుగోసారి టెండర్లు పిలిచిన ప్రభుత్వం బిడ్ దాఖలుకు ఈనెల 19 వరకు గడువు ఇచ్చింది. సెప్టెంబర్ నెల వచ్చినా ఇంకా టెండర్ల ప్రక్రియ పూర్తికాకపోవడంతో మత్స్యకారుల్లో ఆశలు వదులుకునే పరిస్థితి ఏర్పడింది. జిల్లాలో వరుసగా కురుస్తున్న వర్షాలతో చెరువుల్లోకి కొంత మేర వరద చేరింది. చేప పిల్లల విడుదలకు ఇదే అనువైన సమ యం. అయితే ఆలస్యంగా చేప పిల్లలను వదలడంవల్ల చేపలు ఎదిగేందుకు ఆలస్యమై మత్స్యకారులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉన్నది. అయితే టెండర్లు దాఖలు కాకపోవడానికి పెండింగ్ బిల్లులే కారణమని తెలుస్తున్నది. గతేడాది వదిలిన చేప పిల్లలకు సంబంధించిన బిల్లులను ప్రస్తుత ప్రభుత్వం ఇంకా గుత్తేదార్లకు చెల్లించలేదు. పెండింగ్ బిల్లులు చెల్లిస్తేనే.. టెండర్‌లో పాల్గొంటామని గుత్తేదార్లు స్పష్టం చేయడంతోనే ఈ పరిస్థితి దాపురించింది. ఈసారి కూడా బిడ్ దాఖలు చేయకపోతే ప్రభుత్వం ఏం నిర్ణయం తీసుకుంటుందో..! అన్న దానిపై సర్వత్రా ఆసక్తి నెలకొన్నది.

ఈ ఏడాది జీవనోపాధి ఎట్లా..

మత్స్యకార కుటుంబాలు చాలావరకు చేపల వృత్తినే నమ్ముకుని బతుకుతున్నాయి. ఈసారి ప్రభుత్వం ఉచిత చేప పిల్లల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టకపోవడంతో జీవనోపాధి ఎట్లా..? అని వారు మదనపడుతున్నారు. గతంలో సెప్టెంబర్ నాటికే పంపిణీ ప్రక్రియ పూర్తయ్యేది. కాంగ్రెస్ ప్రభుత్వం టెండర్లతో కాలయాపన చేయడం తగదు. ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసి చెరువుల్లో చేపపిల్లలను వదలడం ద్వారా మత్స్యకార కుటుంబాలకు ఉపాధిని చూపాలి.

-గుండు సురేశ్, మత్స్య పారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షుడు, గూడూరు

చేప పిల్లల పంపిణీపై నీలినీడలు

- **చెరువుల్లో చేపల విడుదలకు గడువు ముగుస్తున్నా పూర్తికాని టెండర్ల ప్రక్రియ**
- **ఇప్పటికే మూడు సార్లు పిలిచినా ముందుకు రాని గుత్తేదార్లు**
- **ఈనెల 19 గడువుతో నాలుగోసారి టెండర్లు పిలిచిన ప్రభుత్వం**
- **గత ప్రభుత్వంలో ప్రతిఏటా 1.93 కోట్ల చేప పిల్లల పంపిణీ**
- **చేపల వేటనే నమ్ముకుని జీవిస్తున్న 9,136 మంది మత్స్యకారులు**
- **జీవనోపాధిపై ఆందోళన చెందుతున్న కుటుంబాలు**

జిల్లా దవాఖానలో నిరసన తెలుపుతున్న ఔట్‌సోర్సింగ్ కార్మికులు

నాలుగు నెలలుగా జీతాలిస్తలేరు..

జిల్లా దవాఖానలో ఔట్‌సోర్సింగ్ కార్మికుల నిరసన

సూపరింటెండెంట్‌కు వినతి పత్రం అందజేత

కొండాపూర్, సెప్టెంబర్ 10 : కొండాపూర్‌లో ఉన్న రంగారెడ్డి జిల్లా దవాఖానలో శానిటేషన్, పేషెంట్ కేర్, సెక్యూరిటీ విభాగాల్లో విధులు నిర్వహిస్తున్న ఔట్‌సోర్సింగ్ కార్మికులు గత నాలుగు నెలలుగా జీతాలిస్తలేరంటూ మంగళవారం దవాఖాన ఆవరణలో నిరసన వ్యక్తం చేశారు. నాలుగు నెలలుగా జీతాలు ఇవ్వకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని సీపీఐ శేరిలింగంపల్లి కార్యదర్శి టీ రామకృష్ణ, ఏఐటీయూసీ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి చందు యాదవ్‌లతో కలిసి కార్మికులు దవాఖాన సూపరింటెండెంట్ అనురాగిణీరెడ్డికి వినతిపత్రం సమర్పించారు. అనంతరం దవాఖాన ఆవరణలో నిరసన చేపట్టారు. సీజనల్ వ్యాధులతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో నిరవధిక సమ్మె చేయడం లేదని, అధికారులు మా బాధలు అర్థం చేసుకుని వెంటనే జీతాలు అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా దవాఖాన కార్మికులు, నాయకులు శ్రావణ్ కుమార్ యాదవ్, కే ఖాసీం, ఆంజనేయులు, పద్మమ్మ, తదితరులు పాల్గొన్నారు.